





జిల్లా క్రీడా అసోసియేషన్‌లో జగడం!

- జిల్లాలో రెండుగా చీలిన క్రీడా అసోసియేషన్లు
- అసలైన అసోసియేషన్ మాదంటే.. మాది అంటూ కిరికిరి
- ఒలింపిక్ అసోసియేషన్ గుర్తింపు లేకుండా అసోసియేషన్ల చెలామణి
- అసలైనది ఏదో తెలియక నష్టపోతున్న జిల్లా క్రీడాకారులు
- పట్టించుకోని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్


అసోసియేషన్లకు ఒలింపిక్ సంఘం గుర్తింపు ఉండాలి..



:బొబ్బిలి నర్సయ్య, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి

జిల్లాలో అసోసియేషన్లకు ఒలింపిక్ సంఘం గుర్తింపుతోపాటు జిల్లా క్రీడల యువజన శాఖ గుర్తింపు ఉండాలి. ఇష్టం వచ్చినట్లు అసోసియేషన్లు ఏర్పాటు చేసుకొని క్రీడాకారులకు నష్టం కలిగించరాదు. క్రీడాకారులు గుర్తింపు పొందిన అసోసియేషన్ క్రీడాల్లోనే పాల్గొనాలి. వీటి సర్టిఫికెట్లు పైచదువులకు ఉద్యోగాల్లో ఉపయోగపడుతాయి.

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా అసోసియేషన్‌లో జగడం మొదలైంది. జిల్లాలో క్రీడా మైదానాలు, కోచ్‌లు లేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతుంటే.. అసోసియేషన్ల పేరిట కొందరు క్రీడాకారుల జీవితాలతో ఆటలు ఆడుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒలింపిక్ అసోసియేషన్ గుర్తింపు ఇచ్చిన సంఘాలే జిల్లాలో అసోసియేషన్లుగా కొనసాగాల్సి ఉండగా.. అవేమి పట్టనట్లు కొందరు వ్యవహరిస్తున్నారు. కొన్నేళ్లుగా రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్లు రెండుగా చీలడంతో... జిల్లాకు చెందిన అసోసియేషన్ సంఘాల నాయకులు కూడా రెండుగా చీలి సంఘాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. రాష్ట్రంలోనే ఏది సరైన గుర్తింపు సంఘమో తెలియక ఇబ్బందులు పడుతుంటే.. జిల్లాలో సైతం రెండు సంఘాలుగా ఏర్పడి క్రీడాకారులను ఇబ్బందులు పెడుతున్నారు. జిల్లా అసోసియేషన్‌లలో సైతం ఏళ్ల తరబడి అధ్యక్షులుగా, కార్యదర్శులుగా కొనసాగుతున్నారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్‌లో పెత్తనం కోసం హైదరాబాద్ నుంచి ఏదో ఒక అసోసియేషన్‌ను తెచ్చుకొని తమ ఉనికిని చాటుకుంటున్నారు. రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్‌లో గుర్తింపు పొందిన అసోసియేషన్లు 52 ఉండగా జిల్లాలో సుమారు 10కి పైగా అసోసియేషన్లు రెండుగా చీలిపోయాయి. ఏ అసోసియేషన్ సరైందో తెలియక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. క్రీడా సంఘాల నాయకులు తమ రాజకీయ పలుకుబడి కోసం క్రీడా సంఘాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. వీటితో పాటు జిల్లా క్రీడల శాఖ కేవలం 31 అసోసియేషన్లను మాత్రమే అధికారికంగా గుర్తించింది.



జిల్లాలో రెండు అసోసియేషన్లతో కిరికిరి

జిల్లాలో పదికిపైగా అసోసియేషన్లు రెండుగా చీలిపోయాయి. ఇందులో ఏది గుర్తింపు పొందిన సంఘమో? అనేది క్రీడాకారులకు ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల సీఎం కప్ నిర్వహణలో గుర్తింపు సంఘాలపై లొల్లి తేటతెల్లమైంది. ఉషూ క్రీడా నిర్వహణకు బాధ్యతలు ఒకరికి అప్పచెప్పగా ఇది నా సంఘం అంటూ.. మరొకరు వచ్చి గొడవ చేయడంతో ఒకరినొకరు క్రీడా మైదానంలోనే పిడిగుద్దులు గుద్దుకున్నారు. అనంతరం కేసు పోలీసు స్టేషన్ వరకు వెళ్లింది. ఒలింపిక్ అసోసియేషన్ పెద్దలు సర్దిచెప్పడంతో ఇరువర్గాలు వెనుదిరిగాయి. ఇలాంటి ఘటనలు జిల్లాలో చాలానే జరిగాయి. హ్యాండ్‌బాల్, బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్, తైక్వాండో అసోసియేషన్లు జిల్లాలో రెండు ఉన్నాయి. దీంతో ఏదిసరైన అసోసియేషనో అర్థం కాక క్రీడాకారులు నష్టపోతున్నారు. తైక్వాండోలో సైతం రెండు అసోసియేషన్ల లొల్లి కొన్నేళ్లుగా కొనసాగుతోంది. రెండు అసోసియేషన్లు వేర్వేరుగా క్రీడలు నిర్వహిస్తున్నాయి.

నష్టపోతున్న క్రీడాకారులు

క్రీడాకారులు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ చాటాలంటే అసోసియేషన్ తప్పనిసరి. దీని ద్వారానే క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొంటారు. అసోసియేషన్ల ద్వారా వచ్చిన క్రీడలను, క్రీడాకారులను మాత్రమే ఒలింపిక్ అసోసియేషన్ గుర్తిస్తుంది. అయితే కొన్నేళ్లుగా జిల్లాలో పదికి పైగా అసోసియేషన్లు రెండుగా చీలి క్రీడాకారులను ఇబ్బందులకు గురిచేస్తున్నా.. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ చర్యలు తీసుకోవడం లేదు.



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

బీసీ కులగణన పేరుతో కాంగ్రెస్ కుట్ర

చిత్తశుద్ధి ఉంటే మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించాలి

అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బీసీ కులగణన పేరుతో కాంగ్రెస్ పెద్ద కుట్ర చేయబోతుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పదిశాతం ఉన్న బీసీ ముస్లింలను బీసీలో కలిపే కుట్రకు కాంగ్రెస్ పూనుకుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కోసమే కాంగ్రెస్ డ్రామా చేసిందన్నారు. ప్రభుత్వం లెక్కల ప్రకారం 1.85 కోట్లకు పైగా జనాభా ఉంటే కాంగ్రెస్ లెక్కల ప్రకారం 1.6కోట్లు ఉందని చెప్పి మిగతా 21లక్షల మంది బీసీలు ఏమయ్యారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన తప్పుల తడకగా ఉందని అనడానికి ఆ పార్టీ ఎమ్మెల్సీ మల్లన్న రిపోర్ట్‌లను తగలబెట్టడమే నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్‌కు బీసీ బిడ్డలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే మంత్రివర్గంలో బీసీలకు సముచితం న్యాయం ఎందుకు కల్పించలేకపోతున్నారో సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి, నాగోళ్ల లక్ష్మీనారాయణ, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటా..

నగరంలోని కోటగల్లిలో ప్రసాద్, సుమలతల ఇల్లు శుక్రవారం ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతి కావడంతో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ధన్‌పాల్ సూర్యనారాయణ ట్రస్ట్ ద్వారా బాధిత కుటుంబానికి రూ.25వేల ఆర్థిక సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడి బాధితులకు పునరావాస కల్పన, ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయం అందించేలా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ముగిసిన న్యాక్ బృందం పర్యటన

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం న్యాక్ బృందం పర్యటన ముగిసింది. ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే పర్యటనలో భాగంగా న్యాక్ బృందం నాల్గవ సారి కళాశాలను పరిశీలించారు. గిరిరాజ్ కళాశాల ప్రస్తుతం న్యాక్ బి గ్రేడ్ రేటింగ్‌లో ఉండగా ఏ గ్రేడ్ కోసం దరఖాస్తు చేయగా న్యాక్ బృందం కళాశాలను పరిశీలించింది. న్యాక్ బృందంలో చైర్‌పర్సన్ రాకేష్‌కుమార్ గుప్త, సభ్యులు హరిచంద్ర రమణే, అనిరుధ్ భార్గవన్‌లు ఉన్నారు. కళాశాల వివరాలను ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి ఇతర అధ్యాపకులు న్యాక్ బృందానికి వివరించారు. రెండు రోజుల పాటు న్యాక్ బృందం కళాశాలలోని ప్రతీ విభాగాలను పరిశీలించారు. త్వరలోనే గ్రేడింగ్‌ను ప్రకటించే అవకాశం ఉంది.

గ్యారంటీలను నెరవేర్చని కాంగ్రెస్ నాయకులను నిలదీయండి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీలను అమలు చేయని కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్‌కు మోసం చేయడం వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. ఎన్నికల్లో హామీలు నాటకం అని పార్టీ నేతలు చెప్పే మాటలు వచ్చి బూటకమని జీవన్‌రెడ్డి అన్నారు. ఆరు గ్యారంటీలు అబద్ధమని కాంగ్రెస్ పార్టీది ప్రజలమీద కపట ప్రేమ చూపిస్తోందని ఆయన అన్నారు. రేవంత్‌రెడ్డి తెలంగాణకు కాంగ్రెస్ చిట్టచివరి సీఎం అని అన్నారు. తమిళనాడు భక్తవత్సల్యం, పశ్చిమబెంగాల్ సిద్ధార్థ శంకర్‌లాగే సీఎం రేవంత్‌రెడ్డి చివరి వాడన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కోసం కాంగ్రెస్ పాట్లు పడుతుందని అన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు 6లక్షలకు పైగా రేషన్ కార్డులు జారీ చేశామని రేషన్ కార్డులు ఇవ్వలేదంటూ అబద్ధపు ప్రచారం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల కల్తీ ఆహారం తిని గురు కులాల్లో 55 మందికి పైగా విద్యార్థులు దుర్మరణం చెందారని జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లాలో కాంగ్రెస్, బీజేపీది అవి నీతి బంధం అని, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఇన్‌చార్జి వినయ్ రెడ్డిలు కుమ్మక్కై దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. నవీపేట మండలం సిరాన్‌పల్లిలోనే ప్రభుత్వ పథకాల అమలుపై చర్చకు సిద్ధం అని, హామీలన్నీ అమలైతే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్నారు. లేకుంటే కాంగ్రెస్, బీజేపీ నేతలు ముక్కు నేలకు రాస్తారా అని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ మేయర్ దండు నీతూకిరణ్, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు సిర్పరాజు, ప్రభాకర్‌రెడ్డి, అభిలాష్, కేజీ సురేష్, తెలంగాణ శంకర్, సత్యప్రకాశ్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

పాఠశాలల్లో విద్యాప్రమాణాలను మెరుగుపర్చాలి

- హెచ్‌ఎంల సమావేశంలో కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలతో సమావేశం నిర్వహించారు. పదో తరగతి వార్షిక పరీక్షల సన్నద్ధతపై కలెక్టర్ వారికి దిశా నిర్దేశం చేశారు. మార్కులు, గ్రేడ్ పాయింట్లు ప్రామాణికం కాకుండా విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలన్నారు. ప్రాథమిక దశ నుంచే విద్యార్థులలో చదువు పట్ల శ్రద్ధను కలిగిస్తే వారు ఏకాగ్రతతో విద్యను నేర్చుకొని సత్ఫలితాలను సాధించగలుగుతారని అన్నారు. ప్రభుత్వ పరంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపడుతోందని, ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు ఎంతో మెరుగయ్యాయని, విద్యార్థులకు నాణ్యతతో కూడిన పౌష్టికాహారాన్ని అందిస్తుందన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా ప్రణాళిక బద్ధంగా బోధన చేస్తూ సిలబస్‌ను పూర్తి చేయాలని, ఆయా సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులను నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో సందర్భంగా తాను ఆయా పాఠశాలల్లో తనిఖీ చేసినప్పుడు అనేక పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తే విద్యాప్రమాణాలు సంతృప్తిగా కనిపించ లేదని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. డీఎస్సీ ద్వారా కొత్తగా ఉపాధ్యాయుల నియామకాలు జరిగినందున దాదాపు అన్ని పాఠశాలల్లో టీచర్ల ఖాళీలు భర్తీ అయ్యాయని తెలిపారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడంపై దృష్టికేంద్రీకరించాలన్నారు. ఈ సందర్భంగా ఆపార్ ఐడీలు జనరేట్ చేయడంలో ముందంజలో నిలిచిన ప్రధానోపాధ్యాయులను కలెక్టర్ సన్మానించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, డీఈవో అశోక్, ఏసీ విజయ్‌భాస్కర్, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, చిత్రంలో డీఈవో, ఇతర అధికారులు



విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

ఆర్మూర్‌రూరల్/వేల్పూర్/భీమ్‌గల్, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకొని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శుక్రవారం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆర్మూర్, బాల్కొండ అసెంబ్లీ నియోజకవర్గంలోని భీమ్‌గల్, వేల్పూర్, పెర్కిట్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలపై అడిగితెలుసుకున్నారు. కేంద్రాలలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. అనంతరం ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. బియ్యం, ఇతర సరుకుల వివరాలను అడిగితెలుసుకున్నారు. భీమ్‌గల్ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు అందజేసిన దుప్పట్లు కాస్మోటిక్ కిట్లను పరిశీలించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి వారి అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షించారు. పదో తరగతిలో అత్యుత్తమ గ్రేడ్ సాధించేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రాజాగౌడ్, వేల్పూర్, భీమ్‌గల్, ఆర్మూర్ తహసీల్దార్లు, ఎంపీడీవోలు ఉన్నారు.



జిల్లాలో పెరిగిన విద్యుత్ వినియోగం

- జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరగడంతో భారీ డిమాండ్
- వ్యవసాయానికి ప్రతీరోజు 3.5 మిలియన్ యూనిట్లు
- గృహ అవసరాలకు 7 మిలియన్ యూనిట్ల విద్యుత్ వాడకం
- మార్చిలో విద్యుత్ వినియోగం మరింత పెరిగే అవకాశం
- ముందస్తు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

నిజామాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరగడం, పంటల విస్తీర్ణం ఎక్కువ కావడం వల్ల ప్రతీరోజు డిమాండ్ పెరుగుతోంది. వ్యవసాయంతో పాటు గృహ అవసరాలకు ఎక్కువగా విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. గత సవంత్సరం ఫిబ్రవరి చివరి వారం నుంచి ఎండలు పెరిగి విద్యుత్ వినియోగం ఎక్కువ కాగా.. ఈ సంవత్సరం మాత్రం నెల ఆరంభం నుంచే డిమాండ్ పెరుగుతోంది. వరి పంట ఎక్కువగా వేయడం వల్ల బోర్ల వినియోగం ఎక్కువ ఉండటంతో వ్యవసాయానికి ఎక్కువ మొత్తంలో వినియోగం అవుతోంది. ఎండలు పెరగడం వల్ల పగటితో పాటు రాత్రిపూట గృహ అవసరాలకు కూడా ఎక్కువ మొత్తంలో విద్యుత్ వినియోగిస్తున్నారు. మార్చి నుంచి మే వరకు మరింత ఎక్కువగా వినియోగం అవుతుందని విద్యుత్ అధికారులు అంచనా వేస్తున్నారు. వ్యవసాయంతో పాటు గృహ అవసరాలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

ముదురుతున్న ఎండలు

జిల్లాలో ఎండలు ముదురుతున్నాయి. జనవరి చివరి వారం నుంచే 34 డిగ్రీల నుంచి 35 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఫిబ్రవరి ఆరంభం నుంచి ఇప్పటి వరకు ప్రతీరోజు 34 డిగ్రీల నుంచి 36 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత సంవత్సరం ఇదే సమయంలో జిల్లాలో 32 డిగ్రీల నుంచి 34 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం 2 డిగ్రీల ఉష్ణోగ్రత ముందుగానే పెరగడంతో ఆ ప్రభావం విద్యుత్ వినియోగంపైన పడింది. జిల్లాలో వ్యవసాయ పంటలతో పాటు గృహ అవసరాలకు ఒకేసారి విద్యుత్ వినియోగం ఎక్కువైంది. గత సంవత్సరం ఇదే సమయంలో విద్యుత్ వినియోగం జిల్లాలో 9.8 మిలియన్ల యూనిట్ల వినియోగం ఉంది. వ్యవసాయంతో పాటు ఇతర పంటలకు గత సంవత్సరం ఫిబ్రవరి ఆరంభంలో విద్యుత్ సరఫరా చేశారు. ఫిబ్రవరి ఆరంభం నుంచి ఎండలు పెరగడం వల్ల ఈ సంవత్సరం 10.8 మిలియన్ యూనిట్లను ప్రతీరోజు వినియోగం అవుతుండటంతో దానికి సరిపడా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు.

సాగుకు పెరిగిన విద్యుత్ వినియోగం

జిల్లాలో వ్యవసాయ వినియోగం భారీగా పెరిగింది. జిల్లాలో మొత్తం లక్షా 85వేల పంపుసెట్లు ఉండగా వీటికి ప్రతిరోజూ వినియోగం 3.5 మిలియన్ యూనిట్లు అవుతుంది. వ్యవసాయానికి పొద్దంతా త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను కొనసాగిస్తున్నారు. గత సంవత్సరం ఫిబ్రవరి ఆరంభంలో వినియోగం 3 మిలియన్ యూనిట్ల వరకు ఉండేది. ఫిబ్రవరి చివరి వారం నుంచి ఏప్రిల్ రెండో వారం వరకు 3.5 మిలియన్ యూనిట్ల వరకు వినియోగం అయ్యేది. జిల్లాలో గృహ కనెక్షన్లు 4లక్షల 80వేలు ఉన్నాయి. జిల్లాలో ప్రతీరోజు గృహ అవసరాలకు 7 మిలియన్ యూనిట్ల వరకు వినియోగిస్తున్నారు. గత సంవత్సరం ఫిబ్రవరి ఆరంభంలో 6 మిలియన్ యూనిట్ల వరకు విద్యుత్ వినియోగం అయ్యేది. ఈ సంవత్సరం ఎండలు 2 డిగ్రీలు పెరగడం వల్ల ఈ వినియోగం పెరిగింది. జిల్లాలోని పరిశ్రమలకు ఎల్‌టీ, హెచ్‌టీ లైన్‌ల ద్వారా 1.3 మిలియన్ యూనిట్లను వినియోగిస్తున్నారు. మార్చిలో ప్రతీరోజు 11 మిలియన్ల యూనిట్ల కన్న ఎక్కువగా వినియోగం అయ్యే అవకాశం ఉన్నట్లు విద్యుత్ శాఖ అధికారులు అంచనాకు వస్తున్నారు. జిల్లాలో వ్యవసాయానికి విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని ఎన్‌పీడీసీఎల్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ రవీందర్ తెలిపారు. వ్యవసాయంతో పాటు గృహ అవసరాలకు ఎక్కువగా వినియోగిస్తున్నారని అన్నారు. ఎండలు పెరగడం వల్ల ఈ వినియోగం ఎక్కువైందని ఆయన తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

- ఐసీడీఎస్ సీడీపీవో జ్యోతి

ఇందల్వాయి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టాలని ఐసీడీఎస్ సీడీపీవో జ్యోతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల విద్యార్థినులతో బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆడపిల్లలు మగ పిల్లలతో సమానం అని, ఇద్దరికీ సమాన హక్కులు ఉన్నాయని ఆమె తెలిపారు. భ్రూణ హత్యలు జరగకుండా చర్యలు చూసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండకుండా వివాహాలు చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శోభారాణి, సునీత, స్వప్న, ప్రిన్సిపాల్ పద్మజ, కో ఆర్డినేటర్ రంజిత్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తడిపొడి చెత్తపై అవగాహన



తడిపొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిరాయత్‌నగర్ ప్రైమరీస్కూల్‌లో మున్సిపల్ ఆధ్వర్యంలో శుక్రవారం తడిపొడి చెత్తపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ రాజు ఆదేశాల మేరకు పాఠశాలలోని విద్యార్థులకు తడి,పొడి, హానికరమైన చెత్తపై అవగాహన కల్పించి సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నివారణ గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగేంద్రనగర్‌లో ఇంట్లో చోరీ



ఇంట్లో వస్తువులను ఎక్కడిక్కడ పారేసిన దుండగులు

ఏర్గట్ల, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని నాగేంద్రనగర్ గ్రామంలో శుక్రవారం వేకువజామున దొంగలు ఓ ఇంటిలో చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఎస్సై బీ.రాము తెలిపిన వివరాల ప్రకారం... జంగం చిన్న ముత్తెన్న అనే వ్యక్తి ఇంటి తాళాలు పగలగొట్టి దుండగులు బెడ్‌రూమ్‌లోని బీరువాలో గల బంగారు ఉంగరం, వెండి కడియాలు, నగదు వెయ్యిరూపాయలు చోరీకి పాల్పడ్డారు. జంగం ముత్తెన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మున్సిపల్ పరిధిలో ప్లాస్టిక్‌పై తనిఖీలు



యజమానికి జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పలుషాప్‌లలో శుక్రవారం మున్సిపల్ అధికారులు ప్లాస్టిక్‌పై తనిఖీలు నిర్వహించి షాప్‌యాజమానులకు జరిమానాలు విధించారు. మున్సిపల్ కమిషనర్ రాజు ఆదేశాల మేరకు పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలోని దుకాణాలు, బెకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లలో తనిఖీలు నిర్వహించి సుమారు 40 కేజీల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకొని షాప్ యాజమానులకు రూ.8వేల జరిమానా విధించారు. తనిఖీల్లో సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, రాజయ్య, మున్సిపల్ సిబ్బంది వెంకటేష్, రవి, అక్షయ్, నర్సయ్య, రమేష్, రాము, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో వీధికుక్కల పట్టివేత



వీధికుక్కలను పట్టుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో పలు వార్డుల్లో సంచరిస్తున్న వీధికుక్కలను శుక్రవారం మున్సిపల్ సిబ్బంది పట్టుకొని ఏబీసీ సెంటర్‌కు తరలించారు. ఇటీవల మున్సిపల్ పరిధిలో కుక్కల బెడద ఎక్కువై విపరీతంగా పెరిగిపోతున్నందున జిల్లా కేంద్రంలోని ఏబీసీ సెంటర్‌లకు కుటుంబనియంత్రణ ఆపరేషన్ తర్వాత పట్టుకున్న చోటే వదిలేస్తామని మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు.

చేపూర్‌లో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన



పనులను ప్రారంభిస్తున్న మాజీచైర్మన్ యాల్ల సాయిరెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం చేపూర్‌లో శుక్రవారం వివిధ వార్డుల్లో రూ.16లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులు, డ్రైనేజీ నిర్మాణానికి నిజాంసాగర్‌ప్రాజెక్టు మాజీచైర్మన్ యాల్ల సాయిరెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం చేపడుతున్న పనులను పూర్తి నాణ్యతతో, త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఇందూరుసాయన్న, కుస్తాపురం గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ జన్నెపల్లి గంగాధర్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖల అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్, రాంసిన్, కటికే శ్రీనివాస్, శాంతి కుమార్, వినోద్, ఆరే రాజు, సాయన్న, సంజీవ్ పాల్గొన్నారు.

మాత రమాయి జయంతి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో సామాజిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం మాతరమాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉద్యమనాయకురాలు రమాయి మహాడ్ సత్యగ్రహంలో దాడికి గురైన వారిని పరామర్శించి కాలరాం మందిర్ ఉద్యమానికి సహాయమందించి ఘనురాలు అని తన పిల్లలను సామాజానికి త్యాగం చేసిన త్యాగమూర్తి అని ఆమె ఆదర్శాలను ప్రతీ కార్యకర్త అనుసరిద్దామని సామాజిక సంఘాల నాయకులు అన్నారు. కార్యక్రమంలో సామాజిక సంఘాల నాయకులు అంగరి ప్రదీప్, పింజ అశోక్, కొక్కెర భూమన్న, అర్గుల్ సురేష్, కల్పన, పరిమిత, శిల్ప, అనురాధ, పద్మిని, రాజు, వికాస్, లింగన్న, మాలాజీ, శేఖర్, చక్రధర్, నర్సయ్య, నీలిమ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్ : వేల్పూర్ మండలం రామన్నపేట్ గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రమాబాయి అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారత్ జైభీమ్, భారత రాజ్యాంగం వర్ధిల్లాలని నినాదాలు చేశారు.

న్యాక్ గుర్తింపే లక్ష్యం



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

ధర్పల్లి ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్) గుర్తింపే తమ లక్ష్యమని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి అన్నారు. శుక్రవారం ధర్పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బాలకృష్ణకు డిగ్రీకళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. కళాశాల చుట్టు ప్రహరీ, విద్యుత్ దీకరణ, కంప్యూటరీకరణ కోసం ఆమె ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. తన పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించి కలెక్టర్ దృష్టికి సమస్యలను తీసుకువెళ్లాలని ఆయన ప్రిన్సిపాల్‌కు సూచించారు. రాబోయే విద్యా సంవత్సరంలో న్యాక్‌గుర్తింపు లక్ష్యంగా తమ అధ్యాపక సిబ్బంది పనిచేస్తున్నారని, అదే విధంగా కళాశాలలో మౌలికసౌకర్యాలు కల్పించేందుకు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసు కువెళ్తామని ఆమె చెప్పారు. కళాశాల ఆవరణ చుట్టు కంపౌండ్‌వాల్ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని, దీని కోసం కొటేషన్ సైతం విద్యుత్ అధికారుల వద్ద తీసుకున్నామన్నారు. సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా ఎంఈవో సూచిం చారు. పలు సలహాలు ఇచ్చారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు

● పట్టణ సీఐ వెంకట నారాయణ

బోధన్‌రూరల్, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణ హెచ్చరించారు. శుక్రవారం బోధన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం రాత్రి రౌడీషీటర్ అబ్బు అతనితో పాటు మరో వ్యక్తి తాగినమైకంలో పాతబస్టాండ్ సమీపంలో వీరంగం సృష్టించారన్నారు. వారిని అదుపు చేయడానికి వెళ్లిన పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించి వారి విధులకు అటంకం కలిగించారన్నారు. ఎవరైనా పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన రౌడీషీటర్ అబ్బుతో పాటు అతనితో ఉన్న యువకుడిని రిమాండ్‌కు తరలించామన్నారు. ఇక నుంచి బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన, తాగిన మైకంలో వీరంగం సృష్టించినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ ప్రాంతానికి చెందిన విక్టరీ దీపు(40)అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందుల వల్ల మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. మృతుడు ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేస్తూ ఇటీవల సస్పెండ్‌కు గురయ్యాడని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మద్యానికి బానిసయ్యాడని, వారం రోజుల క్రితమే భార్య పుట్టింటికి వెళ్లగా ఇంట్లో ఎవరు లేని సమయంలో శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. మృతుడి తల్లి స్వర్ణలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బోధన్ ఆసుపత్రికి తరలించామన్నారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని సాలంపాడ్ క్యాంప్, కొప్పర్తి గ్రామాల మధ్య పంటపొలాల్లో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 12 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా పేకాట ఆడినా, పేకాట నిర్వహించినా కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రజలు పేకాటకు బానిస కావద్దన్నారు. పేకాట నిర్వహించే వారి వివరాలను తమకు సమాచారం అందించాలని వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు.

విద్యార్థులు వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కుష్టు, క్షయ తదితర వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ విఠల్‌రాజ్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ బాలికల వసతిగృహంలో విద్యార్థినులకు క్షయ, కుష్టు వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. విద్యార్థులు వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఆరోగ్యసం రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డెన్ లలిత, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్షను సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ విధించారు. ఆర్మూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన వాహనాల తనిఖీలో అతిగా మద్యం తాగి వాహనాలు నడిపిన ఆదిలాబాద్ జిల్లా మామిడ మండలం యుసాంగ్వి గ్రామానికి చెందిన రాజశేఖర్‌ను పోలీసులు కోర్టు హాజరుపర్చగా రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ముప్కాల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపల్లిలో లబ్ధిదా రులకు మంజూరైనా సీఎంఆర్ఎఫ్ చెక్కులను వేంపల్లి సొసైటీచైర్మన్ జక్కరాజేశ్వర్ బాధిత కుటుంబానికి అందజేశారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు చేయించిన సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్ కుమార్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇట్టం మహేష్, జక్క గంగాదర్, రాజ్‌కుమార్, ధనుష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన రైతు ఉత్పత్తిదారుల పరిశ్రమ డైరెక్టర్లు



మంత్రిని కలిసిన డైరెక్టర్లు

జక్రాన్‌పల్లి, ఫిబ్ర వరి7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరిగిన రైతు సమ్మేళనంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును హార్టికల్చర్ వైస్‌చాన్స్‌లర్ రాజారెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపిని శుక్రవారం మనోహరాబాద్ జేఎంకేపీఏ డైరెక్టర్‌లు పి.తిరుపతిరెడ్డి, రైతులు కలిశారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి శాలువాతో సత్కరించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘ పరిశ్రమ ఆవశ్యకత గురించి రైతులు వారికి వివరించారు. హార్టికల్చర్ ఏడీఏ చంద్రశేఖర్‌తో రైతు ఉత్పత్తిదారుల సంఘానికి 20వేల స్క్వేర్‌ఫీట్ గోదాం మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించి టెస్కాబ్ సీఎండీని కలిసి మంజూరు చేయిస్తానని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో పసుపు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు, జేఎంకేపీఎల్ డైరెక్టర్ పి.తిరుపతిరెడ్డి, రైతులు నగేష్, శ్రీధర్, చిన్నయ్య పాల్గొన్నారు.

వికలాంగుల న్యాయమైన డిమాండ్లను కేంద్రం నెరవేర్చాలి



ఛలో ఢిల్లీ కార్యక్రమానికి తరలివెళ్తున్న వికలాంగులు

బోధన్‌రూరల్,ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): వికలాంగుల జాతీయ హక్కుల వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం బోధన్ నుంచి వికలాంగులు అధిక సంఖ్యలో ఛలోఢిల్లీ కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఏశాల గంగాధర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వికలాంగులకు నెలకు 300రూపాయలు మాత్రమే పింఛన్ ఇస్తుందని, 5వేల రూపాయల పింఛన్ ఇవ్వాలని, అర్హులైన వికలాంగులకు అంత్యోదయ రేషన్ కార్డులు ఇవ్వాలని, 2016చట్టం ప్రకారం ప్రతి వికలాంగుడికి ఉపాధి హామీ పథకంలో 200రోజుల పని దినాలు కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలలో వికలాంగులకు 5శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఈ నెల 10వ తేదిన ఉదయం 10 నుండి సాయంత్రం 5గంటల వరకు ఢిల్లీలో మహాధర్నా జరుగుతుందని, దీనికి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుండి వికలాంగులు పెద్ద ఎత్తున హాజరుకానున్నారన్నారు. ఢిల్లీ తరలివెళ్లిన వారిలో గంపల శంకర్, రాంపటేల్, నాగ్‌నాథ్ పటేల్, ఎల్లయ్య, సాయిలు, చింటు, సాయినాథ్, జగన్ తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాణించాలి

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని సామాజిక సేవకర్త అశోక్‌రోడే, విద్యావికాస్ చైర్మన్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని తట్టికోట ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరీక్ష అట్టలతో పాటు విద్యార్థులు రావాల్సిన జామెంట్రీ బాక్స్ ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పల్నాటి చింటు, ఉపాధ్యాయ బృందం, పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్‌కు డాక్టరేట్ అవార్డు

మోర్తాడ్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న పద్మకు డాక్టరేట్ వచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.పెద్దన్న తెలిపారు. పద్మకు రసాయ నశాస్త్రంలో ఫార్మ సుటికల్ కెమిస్ట్రి విభాగంలో చేసిన పరిశోధనకు తెలంగాణ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పెద్దన్న, ఉపాధ్యాయ బృందం ఆమెను అభినందిస్తూ సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తూ ఉన్నత స్థాయికి చేరుకోవడం ఎంతో గర్వకారణమన్నారు.

వైభవంగా దత్తాత్రేయస్వామి కల్యాణం

వేల్పూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమీనాపూర్ గ్రామసమీపంలో అనాఘ దత్తశ్రమంలో ఆశ్రమ నిర్వాహకులు గోపిస్వామి ఆధ్వర్యంలో రెండు రోజులుగా కొనసాగుతున్న పుష్కర కుంభాభిషేకం, శతచండీయాగం వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం అవధాని సుధీర్‌శర్మ, వేదపండితుల మంత్రోచ్ఛరణాల అనాఘదేవి సమేత దత్తాత్రేయస్వామి కల్యాణం భక్తుల హర్షధ్వానాల మధ్య నిర్వహించారు. ఉదయం మహాగణపతి, కర్మణ పున్యాహవచనం, చండీహవనం, జయదులు, రాష్ట్ర భృతులు, బలిప్రదాన పూర్వక పూర్ణాహుతి, పుష్కర కుంభాభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వందలాది మంది భక్తులు హాజరై అనాఘదేవి సమేత దత్తాత్రేయ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టుకున్న పోలీసులు

మెండోర, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోడిచర్ల గ్రామ సమీపంలో పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం అర్ధరాత్రి సమయంలో జగిత్యాల నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా అందులో అక్రమంగా తరలిస్తున్న 38 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను పట్టుకున్నట్టు ఎస్సై వివరించారు. సివిల్‌సప్లయ్ అధికారి శ్రీనివాస్‌కు సమాచారం అందించామని, పీడీఎస్ బియ్యంను సివిల్ సప్లయ్ అధికారులు అందించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



కోడిచర్ల వద్ద పీడీఎస్ బియ్యంను పట్టుకున్న పోలీసులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవీపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నేపల్లి, యంచసబ్‌స్టేషన్‌ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఆయా విద్యుత్ సబ్‌స్టేషన్‌ల మరమ్మతుల్లో భాగంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని, ఈ విషయంలో వినియోగదారులు తమకు సహకరించాలని ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్ రెడ్డి కోరారు.

బోధన్‌రూరల్ : బోధన్ పట్టణంలో శనివారం సబ్ స్టేషన్ మెయింటనెన్స్‌లో భాగంగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ టౌన్ ఏఈ నాయిని కృష్ణ తెలిపారు. 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని కాలనీలకు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ప్రతి నెల రెండవ శనివారం సబ్‌స్టేషన్ మరమ్మతులు చేపట్టనున్నామన్నారు. ప్రజలకు నిరంతరం విద్యుత్ అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ టౌన్ ఏఈ నాయిని కృష్ణ ఈ సందర్భంగా కోరారు.

ఎడపల్లి : ఎడపల్లి సబ్‌డివిజన్ పరిధిలోని పలు సబ్‌స్టేషన్‌లలో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎడపల్లి ఏడీఈ ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ఎడపల్లి సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివరాలు తెలిపారు. ఎడపల్లి సబ్‌డివిజన్ పరిధిలోని బోధన్ రూర ల్‌లోని ఊట్‌పల్లి, ఏరాజ్‌పల్లి, పెగడాపల్లి, ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ క్యాంపు, రెంజల్ మండలంలోని రెంజల్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ మరమ్మత్తులు చేపడుతున్న దృష్ట్యా శనివారం మధ్యాహ్నం 3గంటల నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలపివేస్తామని ఎడపల్లి ఏడీఈ ప్రభాకర్ పేర్కొన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలి

● డీఈఈ రమేష్



పొలం బాట కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

కోటగిరి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ పంపుసెట్లకు రైతులు తప్పనిసరిగా కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్‌శాఖ టెక్నికల్ డీఈఈ రమేష్ సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఈ రమేష్ మాట్లాడుతూ రైతులు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. గృహవిద్యుత్ సమస్యలు తలెత్తితే తమకు సమాచారం అందిస్తే ఒక్క రోజులో పరిష్కరిస్తామని, వ్యవసాయపరమైన విద్యుత్ సమస్యలు తలెత్తితే రెండు రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. రైతులు, గృహవినియోగదారులు టోల్‌ఫ్రీనంబర్ 1912కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రుద్రూర్ ఏడీ నగేష్ కుమార్, కోటగిరి ఏఈ బుజ్జిబాబు, లైన్‌ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, రాములు, లైన్‌మెన్ వైద్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కారేగాంలో ఉచిత వైద్య శిబిరం



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

కోటగిరి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పొతంగల్ మండలంలోని కారేగాం గ్రామంలో శుక్రవారం నరహరి రవి, సంజీవని ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యంలో ఉచితవైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 200 మందికి సాధారణ వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యురాలు ఇంతియాజ్ బేగం, ప్రభాకర్, గజేందర్, క్యాకప్ప, బాలు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహం కోసం భూమిపూజ



భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

వర్ని, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వర్ని మండలం తగిలేపల్లి గ్రామంలో శుక్రవారం ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు కోసం గ్రామ ప్రజలు భూమిపూజ చేశారు. విగ్రహ దాత బక్క రాములు ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గుజ్జ శంకర్, బక్క నారాయణ, మైసన్ శ్రీధర్, బెడద శ్రీనివాస్, అల్లం సాయిలు, కాశీ పాల్గొన్నారు.

నాడాపూర్‌లో ఎరువుల గిడ్డంగి నిర్మాణానికి తీర్మానం



సమావేశమైన బినోల సొసైటీ పాలకవర్గం

నవీపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాడాపూర్‌లో నూతనంగా ఎరువుల గిడ్డంగి నిర్మించడానికి బినోల సొసైటీ పాలకవర్గం సమావేశంలో తీర్మానించారు. శుక్రవారం సొసైటీ చైర్మన్ హన్మాండ్లు అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘంలో నూతనంగా సభ్యులుగా చేరడానికి పట్టాదారు పాసుపుస్తకం కలిగిన రైతులు వెయ్యిరూపాయల సభ్యత్వ రుసుమును చెల్లించి సభ్యులుగా చేరాలని తీర్మానించారు. ఈ సందర్భంగా సంఘం ఆర్థిక లావాదేవీలు, జమ, ఖర్చులు, లాభనష్టాల ఖాతా చదివి వినిపించి ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బాబర్, డైరెక్టర్లు, సీఈవో రమేష్ ఉన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



నవీపేటలో క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఐ

నవీపేట,ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): సోషల్ జస్టిస్‌ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ మేరకు శుక్రవారం నవీపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ వినయ్ చేతుల మీదుగా క్యాలెండర్లను ఆవిష్కరించారు. సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆర్గనైజేషన్ సభ్యులు చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎస్‌ఐ అన్నారు. కార్యక్రమంలో ఉత్తర తెలంగాణ చైర్మన్ పండరి, రాకేష్, దేవేందర్, నర్సారెడ్డిలున్నారు.

నేటి నుంచి నాళేశ్వర్‌లో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

నవీపేట,ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): నాళేశ్వర్‌లో శనివారం నుంచి సోమవారం వరకు శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ, దత్తాత్రేయ, పోచమ్మ ఆలయాల శిఖరాల ప్రతిష్ఠాపన ఉత్సవాలను నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. మూడురోజులు ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు.

పొతంగల్‌లో ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభం

కోటగిరి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పొతంగల్ మండల కేంద్రంలో సత్యమార్గం సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం పేద మహిళల కోసం ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ కొత్తపల్లి రమేష్ మాట్లాడుతూ.. మహిళలకు 40 రోజుల పాటు టైలరింగ్‌లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫ్యాకల్టి ట్రైనర్ లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీ మృతి

వర్ని, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనగర్ గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ గుంటూరు కోటేశ్వర్‌రావు గురువారం గుండెపోటుతో మృతిచెందినట్లు వర్ని ఎస్‌ఐ తెలిపారు. మృతుడు గత పది సంవత్సరాలుగా మేకవెంకటేశ్వర రావు వద్ద వ్యవసాయ కూలీ పనిచేస్తున్నాడన్నారు. గురువారం పొలంలో భోజనం చేసేసమయంలో గుండెపోటుతో మరణించినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఫటా..ఫట్...

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

•సత్యనారాయణ, తహసీల్దార్ బీబీపేట



బీబీపేట మండలంలో అక్రమంగా ఇసుక అక్రమంగా తరలిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మరిన్ని వివరాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: మీ తహసీల్ పరిధిలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి?

తహసీల్దార్: మండల తహసీల్ పరిధిలో 11 గ్రామాలు ఉన్నాయి.మాల్యాపూర్, తుజాల్‌పూర్, ఇస్సనగర్, యాడారం, జనగామ, కోనాపూర్, శేరీ బీబీపేట, బీబీపేట, ఉప్పర్‌పల్లి, రాంరెడ్డిపల్లి ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: కార్యాలయంలో అధికారులు,సిబ్బంది అందరూ విధులు నిర్వహిస్తున్నారా?

తహసీల్దార్: కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పోస్ట్ ఒకటి ఖాళీగా ఉంది. మిగాత సిబ్బంది అందురూ విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: రైతులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుని నేరుగా వస్తున్నారా? లేకా దళారులు కార్యాలయం చుట్టూ ఉంటున్నారా?

తహసీల్దార్: కార్యాలయం ఆవరణలో ఎలాంటి వ్యక్తులు లేరు. దళారులు ఆఫీస్ దగ్గర కనిపిస్తే వారిపై కేసులు నమోదు చేస్తాం. రైతులు నేరుగా సంప్రదిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: వివిధ సర్టిఫికెట్‌లు జారీ విషయంలో చాలా రోజులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి నిజమేనా?

తహసీల్దార్: క్యాస్ట్, ఇన్‌కామ్, ఇతర సర్టిఫికెట్‌ల జారీ విషయంలో రెండు రోజుల్లో అందజేస్తున్నాం. ఎపుడైన సర్వర్ ప్రబ్లం ఉన్నపుడు మాత్రం కాస్త లేట్ అవుతుంది. డిజిటల్ సైన్ ఒక్కటే ఉన్నందున రిజిస్ట్రేషన్ పూర్తి అయ్యాక డిజిటల్ సైన్‌తో ఆపరేటర్ ఎక్కువ సమయం కేటాయించి పనులు పెండింగ్ లేకుండా పూర్తి చేయిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో మొత్తం సర్వే నంబర్‌లు ఎన్ని ఉన్నాయి. భూవిస్తీర్ణం ఎంత ఉంది?

తహసీల్దార్: మండలంలో మొత్తం సర్వే నంబర్‌లు 7556, భూ విస్తీర్ణం 19293.10 వరకు ఉంది. ఇందులో ఫారెస్ట్ 38.10 ఉంది.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఇసుక అక్రమ రవాణా కొనసాగుతుందా?

తహసీల్దార్: మండలంలోని 11 గ్రామాల్లో ఎక్కడ కుడా అక్రమంగా ఇసుక రవణా లేదు ఎక్కడైన అక్రమంగా ఇసుక తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ● (ఆంధ్రజ్యోతి, దోమకొండ(బీబీపేట)



ధ్వజ స్తంభానికి పూజలు చేస్తున్న విద్యారణ్య భారతీ స్వామి

ప్రపంచంలోనే గొప్పది..

భారత దేశ సంస్కృతి

జగద్గురు శంకరాచార్య హంపీ విరూపాక్ష విద్యారణ్య భారతీ స్వామి



చాముండేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు

నందిపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే భారత దేశ సాంస్కృతి గొప్పదని శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపీ విరూపాక్ష విద్యారణ్య భారతీ స్వామి వెల్లడించారు. నందిపేట మండలంలోని చౌడమ్మ కొండూర్ గ్రామంలో చాముండేశ్వరి ఆలయ పునర్నిర్మాణం జరిగింది. శుక్రవారం ఆయన చేతుల మీదుగా విగ్రహాల ఆవిష్కరణ, ధ్వజ స్తంభం నిర్మాణం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఆలయంలో ప్రతేక పూజలు, అభిషేకాలు చేశారు. భారత దేశంలో హిందువులుగా జన్మించడం అదృష్టంగా భావించాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీ జగద్గురు శంకరాచార్య హంపీ విరూపాక్ష విద్యారణ్య భారతీ స్వామీ భక్తులకు ప్రవచనాలు చేశారు. విజ్ఞానంతో కూడిన పనులు చేస్తే మనశ్శాంతి లభిస్తుందన్నారు. సెల్‌ఫోన్ చార్జీతో ఎంత శక్తి వస్తుందో, దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన సమయంలో చేసిన మంత్రాలతో ఆలయాలకు అంతే శక్తి లభిస్తుందని చెప్పారు. పూర్వ జన్మలో చేసిన పాపాలే నేడు రోగాల రూపంలో వస్తున్నాయని, ఆచారాలు సంప్రదాయాలు పాటించినప్పుడే ఫలితం దక్కుతుందని విద్యారణ్య భారతీ స్వామి చెప్పారు. మండలంలోని పలు ఆలయాలకు భక్తులు ఒంటెలు, ఏనుగులు, గుర్రాలపై వచ్చేవారని ఆయన వెల్లడించారు. గంగా జలం పవిత్రతను గురించి ఆయన భక్తులకు ఉదాహరణలతో వివరించారు. అనంతరం ప్రతీఒక్కరిని ఆయన నేరుగా ఆశీర్వాదించారు. ప్రసాద వితరణ కొసాగించారు. అనంతరం జరిగిన అన్నదానంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీ మంగి రాములు మహరాజ్, జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్ దాదన్నగారి విఠల్ రావు, ఆర్మూర్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హాజరైన భక్తులు

ముస్తాబవుతున్న రాజరాజేశ్వర ఆలయం

రుద్రూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రుద్రూర్ మండల కేంద్రంలో గల అతి పురాతనమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ సుందరీకరణ పనులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుంచి కొనసాగుతున్నాయి. అతి పురాతనమైన దేవాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి శ్రీకారం చుట్టారు. మహా శివరాత్రి సందర్భంగా దేవాలయంలో స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.



రుద్రూర్‌లో ముస్తాబు అవుతున్న శ్రీరాజరాజేశ్వర ఆలయం



ఆర్మూర్‌లోని బీసీ బాలికల వసతి గృహం



బీసీ బాలికల వసతిగృహంలో స్లాబ్ పెచ్చులూడిన దృశ్యం

ఆంధ్రజ్యోతి ఫోకస్



శిథిలావస్థకు చేరిన బీసీ బాలికల వసతి గృహం

శిథిలావస్థలో బీసీ బాలికల వసతిగృహం



విద్యార్థినులు వెళ్లకుండా జాలిని ఏర్పాటు చేసిన దృశ్యం

» మూడేళ్లుగా పట్టించుకోని అధికారులు, నాయకులు » అనుక్షణం భయంతో ఉంటున్న విద్యార్థినులు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాంనగర్ బీసీ బాలికల వసతిగృహం శిథిలావస్థలోకి చేరుకొని మూడేళ్ల గడుస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు. 1988 నవంబర్ 22లో అప్పటి ఎమ్మెల్యే ఏలేటి మహిపాల్‌రెడ్డి బాలికల వసతిగృహాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి చుట్టు పక్కల గ్రామాల నుంచి ఆర్మూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్న విద్యార్థినులు బాలికల వసతిగృహంలో ఉండేవారు. కానీ మూడేళ్లుగా వసతిగృహాలు శిథిలావస్థకు చేరుకొని స్లాబ్ పెచ్చులు ఉడుతుంది. స్లాబ్‌లోని ఓ పక్కన పూర్తిగా పెచ్చులుడి పడడంతో ఆ పక్కకు విద్యార్థి నులు ఉండకుండా జే వైర్‌లతో ప్లాస్టిక్ జాలిలను ఏర్పాటు చేశారు. అలాగే మరో పక్క స్లాబ్ పెచ్చులు ఉండడంతో మరమ్మత్తులు చేయిం చారు. అయిన మిగతా భాగం స్లాబ్ ఎప్పుడు ఊడిపడుతుందోనని విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు. గత మూడేళ్లుగా వర్షాకాలం వచ్చిందంటే వేరే వసతిగృహాలకు విద్యార్థులను హాస్టల్ వార్డెన్ తీసుకు వెళ్తున్నారు. ప్రభుత్వాలు మారిన పేద విద్యార్థుల బతుకులు మారడం లేదని విద్యార్థినుల తల్లిదండ్రులు విచారం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు విద్యాకు ప్రాధాన్యత కల్పిస్తామంటు చెప్పడం తప్ప ఆచరణలో సాధ్యంకావడంలేదు. మూడేళ్లుగా వర్షానికి తడుస్తున్నా వసతి గృహం ఎప్పుడు ఏం అవుతుందో అర్థం కావడంలేదు. దీనికి తోడు వసతి గృహానికి అద్దె కోసం భవంతి లభించడం లేదు. గత ప్రభుత్వం వివిధ కులాల పంక్షన్‌హాళ్ళకు కేటాయించిన నిధులలో ఏదో ఒక కొంత భాగం విద్యార్థుల గురించి ఆలోచించి వసతిగృహాలను నిర్మిస్తే బాగుండేదని విద్యార్థినుల తల్లిదండ్రుల అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని పేద విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని వసతి గృహాన్ని నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

మమ్మల్ని పట్టించుకునే నాథుడు లేడు

● కె.నందిని, జి.లిఖిత, విద్యార్థినులు



పేద విద్యార్థులమైన మా సమస్యలను పట్టించుకునే నాయకుడు, అధికారులు లేరు. మూడేళ్లుగా ఇక్కడే ఉండి విద్యానభ్యసిస్తున్నాం, మా సమస్యలను వింటు వెళ్లిపోయే నాయకులు, అధికారులు ఉన్నారే తప్ప ఈ కాలంలో సమస్యను పరిష్కరించే వారే లేరు. ప్రభుత్వాలు మారినా పేద విద్యార్థులకు ప్రయోజనం లేదు.

ఉన్నతాధికారులకు నివేదించాం

●జయశీల, హాస్టల్ వార్డెన్



వసతిగృహం స్థితిగతులపై ఉన్నతాధికారులకు నివేదించాం. వారి ఆదేశాల మేరకు వసతిగృహానికి అద్దె కోసం భవంతిని వెతుకుతున్నాం.

ఏర్గట్ల లక్ష్మీ వేంకటేశ్వర స్వామి

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

» నేటి నుంచి 14 వరకు కొనసాగనున్న ఉత్సవాలు »12న రథోత్సవం » భారీ ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

భక్తి



ఏర్గట్లలోనిలక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం



స్వామి వారి మూల విరాట్టు



రంగులద్దుకున్న రథం

ఏర్గట్ల, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఏళ్ల చరిత్ర గల ఈ ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రతీ సంవత్సరం గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. గ్రామంలో మధ్యలో ఉన్న ఆలయంలో కొలువైన వేంకటేశ్వరునికి భక్తులు నిత్యం పూజలు నిర్వహిస్తారు. నూతన సంవత్సరంలో సంకాంత్రి తరువాత నిర్వహించే బ్రహ్మోత్సవాలకు దూర ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు ఇక్కడికి వచ్చి వైభవంగా జరిగే ఉత్సవాల్లో పాల్గొంటారు. 490 ఏళ్ల చరిత్ర గల ఈ ఆలయాల కార్యకలాపాలు దరూరీ వంశీకులు స్వామి వారికి సేవలందిస్తున్నట్లు ఎనిమిదవతరం ఆలయ అర్చకులు దూరూరీ రజనికాంత చార్యులు తెలిపారు.

ప్రత్యేక ఆకర్షణగా రథోత్సవం

ఆర్మూర్ డివిజన్ పరిధిలోనే లింబాచల నర్సింహ స్వామి, మోర్తాడ్ వేంకటేశ్వర స్వామి రథాల మాదిరిగానే ఏర్గట్ల వేంకటేశ్వర స్వామి వారి రథం పెద్దదిగా పేరుగాంచింది. గత 60 ఏళ్ల క్రితం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఎత్తయిన రథాన్ని తయారుచేయించారు. ఇటీవలే రథానికి సంబంధించి రాతి చక్రాలను తొలగించి గ్రామానికి చెందిన రాజారం నర్సయ్య దాతగా 2లక్షల 35 వేలతో దాతగా నూతన చక్రాలను తయారు చేయించారు. ఈ రథోత్సం ప్రతీ ఏటా కన్నుల పండువగా నిర్వహిస్తారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథంపై గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగిస్తారు. ఈ రథోత్సవాన్ని తిలకించడానికి గ్రామంతో పాటు మండలంలోని గ్రామాల్లోని భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

జాతర కార్యక్రమాల వివరాలు

నేటి నుండి నుంచి ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు పుణ్యాహవచనం, అంకురార్పణం, కలశస్థాపన, తీర్థప్రసాదాలు, 9వ తేదిన ఉదయం అగ్ని ప్రతిష్ఠహోమం, ధ్వజారోహణ, గరుడలగ్నం, బలిహరణం, సాయంత్రం హోమం, 10న నిత్యహోమం, సాయంత్రం ఎదురుకోళ్ళు, సాయంత్రం 6గంటల 06 నిమిషాలకు శ్రీశ్రీశ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణోత్సవం సేవా కార్యక్రమలు, 11న ఉదయం నిత్యహోమం, సాయంత్రం బలిహరణం, దోపుశేర సేవ, 12న బుధవారం రాత్రి 9 గంటల 9 నిమిషాలకు రథోత్సవం జాతర, 13న అన్నప్రసాదం, 14న తెల్లవారు జామున నాగవెల్లి కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు

●ధరూరి రజినీకాంతాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు



ప్రతీ సంవత్సరం శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నాం. ఏళ్ల చరిత్ర గల ఈ ఆలయంలో స్వామి వారికి మా వంశీయులకు సేవలందించే భాగ్యం మాకు కలిగింది. కోరికలు తీర్చే వేంకటేశున్ని ప్రతీయేడు భక్తుల తాకిడి పెరిగింది. ఆలయం అభివృద్ధి చెంది కొత్త శోభను సంతరించుకుంది. ఈ సంవత్సరం బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నాం.



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఖిల్లా డిచ్‌పల్లి రామాలయం

నేటి నుంచి ఖిల్లా డిచ్‌పల్లి సీతారాముల బ్రహ్మోత్సవాలు

•14వ తేదీ వరకు కొనసాగనున్న వేడుకలు
• హాజరుకానున్న మంత్రి కొండా సురేఖ, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక ఖిల్లా డిచ్‌పల్లి రామాలయం బ్రహ్మోత్సవాలు నేటి నుంచి 14 వరకు సీతరామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా మంత్రి కొండ సురేఖ, టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిలను ఆహ్వానించినట్లు ఆలయ ధర్మకర్తలి మండలి చైర్మన్ జంగం శాంతయ్య తెలిపారు. 6 రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలకు డిచ్‌పల్లి, ఇందల్వాయి, మోపాల్ మండలంతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలిరానున్నారు. 8న ఏకాదశి సందర్భంగా అంకుర్పారణం, అఖండ దీపారాధన, రక్ష బంధనంతో బ్రహ్మోత్సవ పూజలు ప్రారంభమై 10న సీతారామచంద్ర స్వామి కల్యాణం, 11న బలిహారం, గరుడ సేవా, 12న రథోత్సవం, 13న జాతర, (చక్రతీర్థం), 14న నాగవెల్లి కార్యక్రమాలు జరగనున్నాయి. ఉత్సవాలు జరిగే ప్రతీరోజు భక్తులకు అన్నదానం నిర్వహించను న్నామని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జంగం శాంతయ్య పేర్కొన్నారు.



ముస్తాబైన సీతారాముల విగ్రహాలు



విద్యుత్ దీపాలతో రామాలయం స్వాగత తోరణం

ర్యాలీల హోరు.. నామినేషన్ల జోరు

• పట్టభద్రుల స్థానానికి 28 • ఉపాధ్యాయ స్థానానికి 2
• ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన అభ్యర్థులు

కరీంనగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు గడువు సమీపిస్తుండడంతో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు వేశారు. శుక్రవారం ఒక్కరోజే పట్టభద్రుల స్థానానికి 28 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఇద్దరు మొత్తం 30 నామినేషన్లను దాఖలు చేశారు. పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోటాపోటీగా భారీ ర్యాలీగా వచ్చిన నామినేషన్లు వేయడంతో నగరంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోలాహలం కనిపించింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు, మాజీ మేయర్ సునీల్‌రావుతో కలిసి మహాశక్తి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నామినేషన్ పత్రాలను అందజేశారు. అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, పార్టీశ్రేణులతో కలిసి మహాశక్తి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకొని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి నామినేషన్ పత్రాలను అందజేశారు. స్వతంత్ర అభ్యర్థి అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పట్టభద్రులు, అభిమానులతో కలిసి ఎస్సారార్ కళాశాల నుంచి డప్పుచప్పుళ్ల, ఒగ్గడోలు బృందాలు, కళాకారుల ఆటపాటలతో భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకొని నామినేషన్ అందజేశారు. టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి పీఆర్‌టీయూ నాయకుడు వంగ మహేందర్‌రెడ్డి మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి ముకరంపుర పద్మనాయక నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు. కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ వేయగా, ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు తరఫున నామినేషన్ వేయించారు. అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కరీంనగర్‌కు చెందిన దయ్యాల ఓంప్రకాశ్, డాక్టర్ బండారి రాజ్‌కుమార్, న్యాంతాబాద్ జనార్ధన్,సంకినేని మధుసూధన్‌రావు, మెక్కు హేమలత, మహ్మద్ ముస్తాక్ అలీ, మంచిర్యాల జిల్లా జన్నారం మండలం శ్రీరామ్‌నగర్‌కు చెందిన డాక్టర్ రాపాల రాజు, గౌతమినగర్‌కు చెందిన జావిద్ అహ్మద్, కోటపల్లి మండలం మల్లంపేటకు చెందిన అంగ సంపత్‌యాదవ్, మందమర్రికి చెందిన పెద్దపల్లి సత్యనారాయణ, ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడకు చెందిన బక్వాడ బాలాజీ, జగిత్యాల జిల్లా కండ్లపల్లికి చెందిన చందా సాయికుమార్, మెదక్ జిల్లా తుప్రాన్‌కు చెందిన ఎనరెల్లి సాయిబాబా, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన దార మనోహర్, సోమ గాని నరేందర్, గరిడెపల్లి మండలం కేతవారి గూడెంకు చెందిన బడే నరసయ్య, కమలాపూర్‌కు చెందిన శనిగరపు రమేశ్‌బాబు నామినేషన్లను దాఖలు చేశారు.



నామినేషన్ పత్రాలను అందజేస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి, కుటుంబసభ్యులు

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి



నీటి ఎద్దడి పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీవో

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవి దృష్ట్యా అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ గౌడ్ అధికారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని వెస్లీనగర్ తండాలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గణేశ్ , మిషన్‌భగీరథ ఏఈ రజిత , కార్యదర్శి శ్రీవాణి అధికారులు గ్రామంలో పరిశీలించారు. తాగునీటిపై అక్కడ సదుపాయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా తాగునీరు వృథా గాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయలన్నారు.

బీపీఈడీ కళాశాలపై చర్యలు తీసుకోండి

● ఆడిట్ సెల్‌డైరెక్టర్‌కు ఏబీవీపీ వినతి



ఆడిట్ సెల్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా పేద విద్యార్థుల వద్ద పరీక్షల ఫీజులు 1600 నుంచి 2500 వరకు వసూళ్లు చేస్తున్న ఆర్మూర్ శ్రీ రాఘవేంద్ర బీపీఈడీ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు శివ మాట్లాడుతూ.. విద్యార్థుల వద్ద పరీక్షఫీజు దౌర్జన్యంగా వసూలు చేయడం తగదని వర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా వర్సిటీ ప్రకటించిన దానికంటే రెండు మూడురెట్లు అధికంగా వసూళ్లు చేస్తున్న కళాశాలపై చర్యలు తీసుకొని గుర్తింపు రద్దు చేయలన్నారు. వీసీ, రిజిస్ట్రార్‌లు కూడా ఈ విషయంపై దృష్టి సారించాలని కోరారు. కనీస వసతులు లేకుండా అక్రమంగా నడుపుతూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని విద్యార్థి నాయకులు మండిపడ్డారు. గుర్తింపు రద్దు చేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వర్సిటీ ఏబీవీపీ నాయకులు సాయికుమార్, మోహన్, అనిల్, నవీన్, సమీర్, లెనిన్, రాఘవేంద్ర ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేటు డిగ్రీ కళాశాలల యజమానులు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంతో మాట్లాడి బకాయిలను విడుదల చేయించాలని ఉమ్మడి జిల్లా ప్రైవేటు డిగ్రీ, పీజీకళాశాలల యజమానులు శుక్రవారం మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన బకాయిల విడుదలకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. వేలాదిమంది విద్యార్థులు ఉచితంగా చదువుకుంటున్న ప్రైవేటు, డిగ్రీ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మూడు సంవత్సరాలుగా విడుదల కాకపోవడంతో కళాశాలల నిర్వహణ కష్టంగా ఉందని తెలిపారు. సిబ్బందికి వేతనాలు కూడా చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నామని అలాగే భవనాలకు అద్దె చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆయనను కలిసిన వారిలో విద్యాసంస్థల యజమానులు మారయ్యగౌడ్, నరాల సుధాకర్, రాజు, సూర్యప్రకాశ్, శంకర్, జైపాల్‌రెడ్డి, గిరి, దత్తు, హరిప్రసాద్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో చోరీలు జరుగకుండా చర్యలు : రైల్వే డీఎస్పీ



రైల్వే పోలీసుస్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ

ఖిల్లా,ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో చోరీలు జరుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని రైల్వేపోలీసు డీఎస్పీ శ్రీనివాస్‌రావ్ సిబ్బందికి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి రైల్వే పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పరిస్థితులను సిబ్బందికి అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా దొంగతనాలను నివారించేందుకు విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రయాణికులు క్షేమంగా గమ్యానికి చేరుకునే విధంగా విధులు నిర్వహించాలని రైల్వే ఎస్‌ఐ సాయరెడ్డికి సూచించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన జిల్లా వాసి



నామినేషన్ దాఖలు చేస్తున్న ముత్తారం నర్సింహాస్వామి

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా జిల్లాకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు ముత్తారం నర్సింహాస్వామి శుక్రవారం తన నామినేషన్‌ను దాఖలు చేశారు. కరీంనగర్‌లో రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతికి నామినేషన్ పత్రాలను అందజేశారు. 398 స్పెషల్ టీచర్లు, పెన్షనర్ల అసోసియేషన్ తనను బలపర్చిందని నర్సింహాస్వామి తెలిపారు. కార్యక్రమంలో బీసీటీయూ రాష్ట్ర ప్రధాన సలహాదారులు తిరునగరి రమణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు

నందిపేట, ఫిబ్రవరి 07 (ఆంధ్రజ్యోతి): నందిపేట, మక్లూర్ మండలాల పరిధిలో ఉన్న 33/11కేవి సబ్ స్టేషన్‌ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయ కలుగుతుందని నందిపేట డివిజన్ ట్రాన్స్‌కో ఏడీఎం అశోక్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడీఈ చెప్పారు.

రెండోవిడత ప్రయోగ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ప్రయోగ పరీక్షలను పరిశీలిస్తున్న డీఐఈవో రవికుమార్



ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఉమెన్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రతినిధులు

● డీఐఈవో రవికుమార్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో రెండోవిడత ప్రయోగ పరీక్షలు శనివారం నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఐఈవో రవికుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వెక్టర్ కళాశాల, ఎస్ఆర్, సత్య వొకేషనల్ జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న ప్రయోగ పరీక్షలను ఆయన తనిఖీ చేశారు. ప్రతీ పరీక్షా కేంద్రాలలో జియోట్యాగింగ్ చేయాలని, సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రిన్సిపాళ్లను కోరారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో నిబంధనల మేరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాలని ఆయన సూచించారు.

రెండోరోజు కొనసాగిన ఉపగ్రహ నమూనా ప్రదర్శన

నిజామాబాద్ అర్బన్: అబ్దుల్ కలామ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్స్‌లెన్స్, డీఆర్‌డీవో, ఎన్ఆర్ఐ ఇస్రో ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఉమెన్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన రాకెట్‌లు మరియు గ్రహాంతర ఉపగ్రహాల నమూనాల ప్రదర్శన శుక్రవారం రెండోరోజు కొనసాగింది. రెండు రోజులుగా రాకెట్‌లు, ఉపగ్రహ నమూనాలకు సంబంధించిన ప్రదర్శనలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం రెండోరోజు జిల్లాలోని 21 పాఠశాలల నుంచి 2వేలకు పైగా విద్యార్థులు ఈ ప్రదర్శనను తిలకించారు. రెండో రోజు ప్రదర్శనలను ఉమెన్స్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, రవిపబ్లిక్ స్కూల్ చైర్మన్ సరళా మహేందర్‌రెడ్డి తదితరులు పరిశీలించారు. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా అంతరిక్ష ఉప గ్రహాల నమూనాల ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

నగరంలో షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

ఖిల్లా,ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి):నగరంలోని కోటగల్లీలో షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో భారీగా ఆస్తినష్టం జరిగినట్లు బాధితు లు అగ్నిమాపక శాఖాధికారులకు తెలిపారు. నగరంలోని కోటగల్లీకి చెందిన ప్రసాద్‌కు చెందిన పురాతనమైన ఇల్లుకు ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించింది. మంటలకు వ్యాపించగానే అప్రమత్తమైన కుటుంబం బయటకు పరుగులు పెట్టింది. అగ్ని మాపక శాఖాధికారులకు సమాచారాన్ని అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖాధికారి నర్సింగ్‌రావ్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఇల్లు పూర్తిగా కాలి బూడిదయింది. ఇంట్లో ఉన్న నగదుతో పాటు విలువైన బంగారం సైతం అగ్నికి ఆహూతయింది.



మంటలను ఆర్పుతున్న సిబ్బంది



వివరాలు అడిగి తెలుసుకుంటున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

సమాచారం అందుకున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని ఘటనకు సంబంధించిన తీరును బాధితులకు అడిగి తెలుసుకున్నారు.

మాలమహానాడు జిల్లా కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు రవి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):మాలమహానాడు జిల్లా నూతన కార్యాలయాన్ని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్, మాతా రమాబాయి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనగారిన వర్గాల కోసం బీఆర్ అంబేద్కర్ ఎన్నో త్యాగాలు చేశారని అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే లౌకికవాదం రాజ్యం ఏలుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ వర్కింగ్ ప్రసిడెంట్ గైనిగంగారాం, రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ నీరడి లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు సక్కిడి విజయ్‌కుమార్ నాయకులు ప్రభంజన్, శేఖర్, విజయ, సునీత, గంగవ్వ, రాజు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కోటగల్లి పాఠశాలను పరిశీలించిన అధికారులు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న శిక్షణ అధికారులు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం నుంచి వచ్చిన శిక్షణ అధికారులు శుక్రవారం నగరంలోని జీపీఎస్ కోటగల్లి పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏ విధంగా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారనే విషయాన్ని గమనించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను, మధ్యాహ్న భోజన నిర్వాహకులను వారు అభినందించారు.

ఎదురగొండ శ్రీలక్ష్మి వేంకటేశ్వర ఉత్సవాలు ప్రారంభం



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

సిరికొండ ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) ఎదురుగొండ శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. శుక్రవారం నుంచి ఆదివారం జరిగే ఉత్సవాలను ఆలాయ కమిటీ సభ్యులు, తూంపల్లి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామిని గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు ముట్టజెప్పుకున్నారు. శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఎదురుగొండ ఆలాయానికి తీసుకెళ్లారు. ఒండమీద ఆలయం వద్ద యజ్ఞాలు నిర్వహించారు. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తారు. ఆదివారం శ్రీలక్ష్మివేంకటేశ్వర స్వామి కల్యాణం, రథోత్సవం, భక్తులకు అన్నసత్రం నిర్వహిస్తారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి: మండలంలోని ఘన్‌పూర్‌లో శుక్రవారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదేశాల మేరకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన సతీశ్‌కు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డా.షాదుల్ల, మాజీ ఎంపీటీసీ రామకృష్ణ, డైరెక్టర్ సతీశ్ రెడ్డి, లింబాద్రి, హరీశ్, భూపతి, దేవేందర్, పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ అంతరాయం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని నగర టౌన్-1, టౌన్-2 ఏడీఈలు చంద్రశేఖర్, ప్రసాద్‌రెడ్డిలు తెలిపారు. పవర్‌హౌజ్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ శంభునిగుడి ఫీడర్ పరిధిలో నెలవారి నిర్వహణలో భాగంగా ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు, సుభాష్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

యూజీసీ ముసాయిదా వ్యతిరేకిస్తూ రిజిస్ట్రార్‌కు వినతి



రిజిస్ట్రార్ యాదగిరికి వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ తయారు చేసిన యూజీసీ ముసాయిదాను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూజీసీ ముసాయిదా వెనక్కి తీసుకోవాలని గవర్నర్‌కు టీయూ రిజిస్ట్రార్ ద్వారా లేఖను పీడీఎస్‌యూ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ మాట్లాడుతూ.. వర్సిటీలను కాషాయికరణ చేయడానికి నూతనంగా యూజీసీ కొత్త నిబంధనలు తెచ్చారని రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలపై కేంద్రం పెత్తనం చెలాయించేందుకు కుట్ర చేస్తుందన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో టీయూ నాయకులు ప్రిన్స్, దేవికా, అక్షయ్, రాజేశ్, హుస్సేన్, తిరుపతి, రోహితు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

లక్ష్మీనరసింహ సుదర్శన హోమాన్ని విజయవంతం చేయండి

నిజామాబాద్ కల్చరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని నిర్వహించతలపెట్టిన లక్ష్మీనరసింహ సుదర్శన హోమాన్ని విజయవంతం చేయాలని పాంచజన్య జ్యోతిష్య ఆలయ వ్యవస్థాపకులు సముద్రాల శ్రీధరాచారి కోరారు. శుక్రవారం శ్రీనివాస్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాడి పంటలతో ప్రజలు సంతోషంగా ఉండాలని కోరుకుంటూ భీష్మ ఏకాదశి పర్వదినాన్న నగరంలోని నాగారంలోగల లక్ష్మీనారసింహాస్వామి క్షేత్రంలో సుదర్శన హోమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 24 గుండాలతో యజ్ఞ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందని అనంతరం లక్ష్మీనారసింహాస్వామి శాంతి కల్యాణం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

ఖిల్లా, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి):చేసిన అప్పులు చెల్లించలేని పరిస్థితిలో ఉన్న వ్యక్తి గుర్తుతెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నాల్గోటౌన్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. నవీపేట మండలానికి చెందిన ర్యాపన్ శంకర్ (58)అనే వ్యక్తి బతుకు తెరువు కోసం నగరంలోని ఓ వెంచర్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. కూతురు పెళ్లికి చేసిన అప్పులు తీరలేనని భావించి రెండురోజుల క్రితం గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉండగా చికిత్సనిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసును మోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న నాయకులు

సిరికొండ ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) కాంగ్రెస్ పార్టీ నాయకులు దోని మోహన్ తండ్రి మల్లయ్య అంత్యక్రియలు శుక్రవారం జరిగాయి. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెల్మ బాస్కర్‌రెడ్డితో పాటు మాజీ ఎంపీటీసీ సభ్యులు సంత్యా నౌషీలాల్, మాజీ సర్పంచ్ కెతావత్ మంజుల బాల్‌సింగ్,యువజన కాంగ్రెస్ రూరల్ నియోజకవర్గం కార్యదర్శి భూపతి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనుల పరిశీలన

పెద్దకొడప్‌గల్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): పెద్దకొడప్‌గల్ మండలకేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ ఇంటినిర్మాణ పనులను శుక్రవారం ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతీ మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ ఇంటినిర్మాణం రూ.5లక్షలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ మోడల్ ఇల్లు ఏ విధంగా అయితే నిర్మాణం అవుతుందో అదేవిధంగా రానున్న రోజుల్లో లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేసుకోవాలని సూచించారు. పనులను తొందరగా పూర్తిచేసి ఇందిరమ్మ మోడల్‌ఇంటిని అందుబాటులోకి తీసుకవస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కుక్కకాటు బాధితులను పరామర్శించిన జీవన్‌రెడ్డి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్‌లో కుక్క కాటుకు గాయాలపాలైన బాలుడిని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి పరామర్శించారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడిని పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కుక్కల నుండి ప్రజలకు భద్రత కరువైందన్నారు. జిల్లాలో పది సార్లకు పైగా కుక్కలు ప్రజలపై దాడులు చేశాయని అన్నారు. తీవ్ర గాయాలైన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై కలెక్టర్ వెంటనే స్పందించాలన్నారు. కుక్కల దాడిలో గాయపడ్డ బాధితులకు ఉచిత వైద్యం అందేలా చూడాలని ఆయన అన్నారు.

చికెన్ ధరలు



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.180	రూ.250	రూ. 270
వెన్‌కాబ్(కిలో)	: రూ.190	రూ.260	రూ. 280



బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.86,700	రూ.80,000	రూ.990

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : సంక్రాంతికి వస్తున్నాం (10.30, 1.30, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-2 : పట్టుదల (10.05, 1.15, 4.25, 7.35, 10.45)
స్క్రీన్-3 : స్కై ఫోర్స్ (హిందీ) (10.15)
: డాకూ మహారాజ్ (1.00, 7.20)
: దేవ (హిందీ) (4.05, 10.25)
స్క్రీన్-4 : దేవ (హిందీ) (10.00, 7.10)
: స్కై ఫోర్స్ (హిందీ) (1.15, 10.25)
: మద గజ రాజ (4.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్
స్క్రీన్-1: తండేల్ (11.00, 1.45, 4.40, 7.35, 10.30)
స్క్రీన్-2 :తండేల్ (11.00)
సంక్రాంతికి వస్తున్నాం (4.30, 7.30)
సనం తేరీ కసం (హిందీ) :(4.30, 10.10)
స్క్రీన్-3 : పట్టుదల (11.00, 1.40, 4.30, 7.20, 10.10)

దేవి : పట్టుదల (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : బాదాస్ రవికుమార్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : తండేల్ (11.30, 2.30, 6.30, 9.30)

- నిజామాబాద్ అర్బన్